క్లుప్తంగా

ఆస్పత్రి అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ మేనక

హిరమండలం: అందరి సహకారంతో ఆస్పత్రి అభివృద్ధి చెందుతుందని హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ తూలుగు మేనక అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆస్పత్రిలో ఓపీ, మందులు తదితర అంశాలపై చర్చించారు. ఆస్పత్రి అభివృద్ధికి ఏడాదికి రూ.1.75 లక్షలు బడ్జెట్ రావల్సి ఉండగా రూ.87 వేలు మాత్రమే బడ్జెట్ ఉంది. ఆస్పత్రి స్టేషనరీ, జంగల్ క్లిరెన్స్, మెంటెనెన్స్‌కు ఖర్చు చేసేందుకు సభ్యులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పీహెచ్‌సీ వైద్యాధికారి సి.హెచ్.సాయిగీత, తహసీల్దార్ బి.వెంకటరమణ, ఎంపీడీఓ బి.శైలజ, సర్పంచ్‌లు డి.సుందరమ్మ, వై.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

సరుబుజ్జిలి: మండల కేంద్రంలోని నందికొండ ప్రాథమిక పాఠశాల 34 మంది విద్యార్థులకు అధ్యాపకుడు బి.శ్రీనివాసరావు గురువారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, కాంపాస్ బాక్సులు అందించారు. ఎంఈఓ బాలరాజు, సీఆర్ఎంటీ బెండి చిన్నారావు, హెచ్ఎం వై.వివేక్‌సుధ, ఉపాధ్యాయిరాలు మోహిని పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు


ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు

సరుబుజ్జిలి: దివ్యాంగ చిన్నారులకు క్రమంతప్పకుండా ఫిజియోథెరపీ చేస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయని ఫిజియోథెరపిస్ట్ గ్రేసి శాంతి తెలిపారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో గురువారం ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. చిన్నారులకు ఫిజియోథెరపీ చేసి, తల్లిదండ్రులకు సూచనలు చేశారు. ఐఈఆర్టీ సి.హెచ్.ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణం


గీతా పారాయణం చేస్తున్న గీతామందిరం సభ్యులు

నరసన్నపేట: స్థానిక గీతా మందిరం బృంద సభ్యులు గురువారం భామిని మండలం లివిర గ్రామంలోని రాదాగోవింద స్వామి ఆలయంలో భవద్గీత పారాయణం నిర్వహించారు. పురాతన రాదాగోవిందస్వామి ఆలయాల్లో ఏడాది కాలంగా చేపడుతున్న భగవద్గీత పారాయణం ఇప్పటివరకు 16 చోట్ల నిర్వహించినట్లు గీతామందిరం అర్చకులు సూరిబాబు తెలిపారు. 30 మంది సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి


తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీముఖలింగంలో శ్రావణ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా గురువారం స్వామివారిని తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పార్వతీపరమేశ్వరులను అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు హారతులిచ్చారు.

ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ


మహ్మద్ యాసిన్

హిరమండలం: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా మహ్మద్ యాసిన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన జి.నారాయణస్వామి వీఆర్‌కు బదిలీ కావడంతో పాతపట్నం ఎస్ఐగా పనిచేసి ఇక్కడకు బదిలీపై యాసిన్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఎస్ఐకు పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.



కఠిన చట్టాలు తీసుకురావాలి

ఈ రోజుల్లో కూడా మహిళలపై ఇలాంటి అఘాయిత్యాలు జరుగుతుండటం నిజంగా బాధాకరం. వైద్య సిబ్బందితో పాటు మహిళలందరికీ రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ఇలాంటివి జరగకుండా మరింత కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

– పి.సుమప్రియ, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోలాకి మండలం



రక్షణ కల్పించాలి

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో మహిళలే అధికంగా విధులు నిర్వహిస్తున్నాం. అందరికీ భద్రత కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పీహెచ్‌సీలకు మద్యం తాగి పలువురు వస్తున్నారు. ఇటువంటి సందర్భాల్లో కొంత భయంగా ఉంటుంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు తగిన రక్షణ కల్పించాలి.

– శిరీష, మాకివలస పీహెచ్‌సీ వైద్యాధికారి, నరసన్నపేట మండలం



అంగన్‌వాడీ.. బోధన తడబడి


చిన్నారులకు పాత పీపీ బుక్స్‌తో బోధన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

- అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరాకాని పాఠ్యపుస్తకాలు
- పట్టించుకోని ప్రభుత్వం
- ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గుచూపుతున్న తల్లిదండ్రులు


అంగన్‌వాడీ కేంద్రాల్లో పాత పీపీ-1, పీపీ-2 పుస్తకాలు

పాతపట్నం: అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. కేంద్రాలు తెరచి నెలలు కావస్తున్నా పాఠ్య పుస్తకాలు అందించకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. పాత పుస్తకాలతోనే బోధన చేయాల్సిన దుస్థితి నెలకొంది. బాల్య దశలో విజ్ఞానం పెంపొందించడంతోపాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక చర్యలకు శ్రీకారం చుట్టింది. చిన్నారులకు ఆటపాటలతో కూడిన బొమ్మల పుస్తకాలు కేంద్రాలకు అందజేసేంది. నాలుగు పుస్తకాలతో కూడిన బర్డ్స్-1, బర్డ్స్-2 కిట్లను అందించింది. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల మాదిరిగా ఇంగ్లిషులో పాఠాలు బోధించడంతో కేంద్రాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. బోధనలకు సంబంధించి రెండు నుంచి నాలుగేళ్లలోపు చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-1 కిట్లు అందజేసేవారు. నాలుగేళ్ల నుంచి ఐదేళ్ల వయస్సు కలిగిన చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లను అందించేవారు. ఈ ప్రభుత్వంలో పాఠ్యపుస్తకాల పంపిణీ ఊసే లేకుండా పోయింది.

నియోజకవర్గంలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	రెండు
అంగన్‌వాడీ కేంద్రాలు	757
మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు	3,497 మంది
మొత్తం విద్యార్థులు	9,925 మంది

పాత పుస్తకాలతోనే బోధన

నియోజకవర్గంలోని పాతపట్నం, కొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. 455 మెయిన్, 302 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మూడు నుంచి ఆరేళ్లలోపు 9,925 మంది చిన్నారులున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటినప్పటికీ అంగన్‌వాడీ కేంద్రాల వైపు దృష్టి సారించలేదు. కేంద్రాలకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలు అందకపోవడంతో వర్కర్లు పాత పుస్తకాలతోనే బోధిస్తున్నారు. గత ప్రభుత్వం సకాలంలో పుస్తకాలను అందించడంతో పాటు వాటిలో చిన్నారులకు ఎంతో ఉపయోగపడే పాఠ్యాంశాలు ఉండడంతో తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల శ్రద్ధ తీసుకుని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేవారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్త పుస్తకాలను అందించకపోవడంతో పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రైవేటు పాఠశాలల్లో చేరిఏంచేందుకు ఆసక్తి చూపుతున్నారు.

త్వరలో కొత్త పుస్తకాలు వస్తాయి



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఢోకా లేదు. ప్రస్తుతం తమ వద్ద ఉన్న పాఠ్యపుస్తకాల విద్యా బోధనకు సరిపోతున్నాయి. త్వరలో కొత్త పుస్తకాలు వస్తాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధన విధానాన్ని ప్రతీరోజు టైమ్ టేబుల్ వేసి అన్ని కేంద్రాలకు పంపించాం. వర్కర్లు చిన్నారులకు పాఠాలు, ఆటల ద్వారా విద్యను బోధిస్తున్నారు.

– టి.విమలారాణి, ఐసీడీఎస్ సీడీపీఓ, పాతపట్నం

ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు


శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

పొందూరు: మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారంతో ముగిశాయి. స్థానిక బాలాజీ థియేటర్ సమీపంలో నాలుగు రోజులు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుని ప్రతిమను ఏర్పాటుచేసి ఘనంగా పూజలు చేశారు. చివరి రోజు ఆర్టీసీ కాంప్లెక్స్, హాస్పటల్ వీధి, మార్కెట్ రోడ్డు, బరంపురం తదితర వీధుల్లో ఊరేగించారు.

152 మందికి దంత పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తూరు: శ్రీకాకుళం పట్టణానికి చెందిన శ్రీసాయి దంత వైద్య కళాశాల, పరిశోధన సంస్థ వైద్యులు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని మెట్టూరు బిట్-2 ఆర్ఆర్ కాలనీలో గురువారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 152 మందికి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం అవసరమైన రోగులకు శ్రీసత్యసాయి ఆస్పత్రికి తరలించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు, బ్రెష్‌లు, పేస్టులు అందజేశారు. వైద్యులు పుష్పప్రియ, లోకేష్, తరుణ్ సాయి, సింధు చౌదరి, వాసవి సేవలు అందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, సర్పంచ్ యర్లంకి ధర్మారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం

- లుకలాం విద్యార్థులకు తొలిగిన కష్టాలు


నూతన తరగతి గదుల్లో విద్యార్థులు

నరసన్నపేట: ఎదురుగా కొత్త భవనాలు అన్ని హంగులతో ఉన్నా చాలీచాలని వసతులతో లుకలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇంత వరకు తీవ్ర అవస్థలు పడ్డారు. తీరుబడి లేక అధికార పార్టీ నాయకులు కొత్త భవనాన్ని ప్రారంభించక పోవడంతో కొత్త భవనాలు నిర్మాణమైనా వినియోగంలోనికి రాలేదు. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందుల దృష్ట్యా తప్పనిసరి పరిస్థితుల్లో కొత్త భవనాన్ని స్కూల్ కమిటీ చైర్మన్ మానికల శాంతారావు, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ చింతల శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. నాడు-నేడు నిధులు రూ.1.20 కోట్లతో నాలుగు తరగతి గదులు నిర్మించిన విషయం విదితమే. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బలివాడ వెంకట రమణ, వైస్ ప్రెసిడెంట్ గండి నాగభూషణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాత్కాలిక సూచిక ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్


చాపర-పలాస రహదారిలో తాత్కాలికంగా సూచిక ఏర్పాటు చేసిన దృశ్యం

మెళియాపుట్టి: ఈ నెల 25వ తేదీన 'ఆదమరిస్తే అంతే' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చాపర-పలాస రహదారిలో చాపర జీడి పరిశ్రమల ప్రదేశంలో రహదారిపై పెద్ద గొయ్యి ఏర్పడింది. వాహనదారులు రాత్రి వేళ భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎటువంటి సూచికలను అధికారులు ఏర్పాటు చేయకపోడవంతో స్థానికులు కొబ్బరి కొమ్మలను గుంత ఉండే ప్రదేశంలో వేశారు. సాక్షిలో కథనం ప్రచురితమైన తర్వాత స్పందించి తాత్కాలికంగా.. కర్రలు, ఎరుపు తాళ్లతో గుంత ఉండే చోట సూచిక ఏర్పాటు చేశారు.

● జలమయం


బజారు వీధిలో కాలువను తలపించేలా వర్షం నీరు


ఆర్టీసీ కాంప్లెక్స్‌లో చేరిన నీరు


ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నరసన్నపేట పట్టణంలోని వీధులన్నీ జలమయమయ్యాయి. బజారు వీధిలో వర్షం నీరు కాలవను తలపించింది. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నీరు అధికంగా చేరింది. పట్టణ శివారు వీధుల్లో వర్షం నీటితో స్థానికులు ఇబ్బంది పడ్డారు. శివనగర్‌కాలనీ, మారుతీ నగర్, గాంధీనగర్, శ్రీనివాసానగర్ తదితర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో వర్షం నీరు చేరింది. నరసన్నపేటలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, వీఆర్వోలను అప్రమత్తం చేశామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు.

– నరసన్నపేట

రైతులందరికీ ఎరువులు అందించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

పొందూరు: రైతులందరికీ ఎరువులు అందించాలని, ఎరువుల స్టాక్ విషయంలో వ్యవసాయశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఏఓ బెండి బాబ్జికి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నాడు-నేడు పనులపై సీఐడీ, విజిలెన్స్ విచారణను ప్రభుత్వం జరిపించనుందన్నారు. అవినీతి చేసిన అధికారులపై చర్యలు తప్పవన్నారు. పొందూరు ప్రభుత్వ పాఠశాలలో అవినీతి జరిగిందని, తగిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను ఎంపీటీసీలు బి.హారిక, ఎ.వాణి కోరారు. నకిలీ, తప్పుడు దివ్యాంగ ధ్రువపత్రాలతో పొందుతున్న పింఛన్లపైన సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించిందని ఎమ్మెల్యే చెప్పారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంపై పలువరు సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, రైతులు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. అందరూ సహకరిస్తే రూ.10 వేల కోట్లతో థర్మల్ పవర్ స్టేషన్ ఏర్పాటు జరిగేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హరిహరరావు, తహసీల్దార్ రమేష్, మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అమ్మ భాష అమృతం

ఘనంగా తెలుగు భాష, క్రీడా దినోత్సవాలు

తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి సందర్భంగా గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలలు, కళాశాలల్లో గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిడుగు తెలుగు భాష కోసం చేసిన కృషిని వక్తలు కొనియాడారు. అమ్మ భాష అమృతం వంటిదన్నారు. విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు


పొందూరు: గూనానపేట పాఠశాలలో గోరింటతో అరచేతిపై అక్షరాలు


సరుబుజ్జిలి: పర్వతాలపేటలో గిడుగు విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు, ప్రజాప్రతినిధులు


కొత్తూరు: మెట్టూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఇన్‌చార్జి హెచ్ఎం హేమలత



బూర్జ: కొల్లివలస కేజీబీవీలో స్పోర్ట్స్ డే ఆకృతిలో విద్యార్థులు


సారవకోట: అవలింగి జేబీటీ పాఠశాలలో తెలుగు తల్లి, గిడుగు వేషధారణల్లో విద్యార్థులు


హిరమండలం: మర్రిగూడ ఆశ్రమ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


ఆమదాలవలస: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిడుగు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్యామ్‌సుందర్, అధ్యాపకులు


నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడాకారులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు


జలుమూరు: కరవంజ ప్రాథమిక పాఠశాలలో అక్షరమాలతో విద్యార్థులు


జలుమూరు: రావిపాడులో తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మరోసారి వాయిదాపడిన ఎస్ఎంసీ ఎన్నికలు

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం హైస్కూల్, ఇస్కలపాలెం ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ ఎన్నికలు కోరం లేక వాయిదా వేశామని ఎంఈఓ డి.బాలరాజు తెలిపారు. ఫకీర్‌సాహెబ్‌పేట, పెద్దసవళాపురం పాఠశాలల ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం పూర్తిచేసినట్లు ఎంఈఓ చెప్పారు. ఉన్నతాధికారులు నిర్ణయించిన తేదీల్లో ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు.